కారు జోరు | అభివృద్ధికి సాక్ష్యం మీరే... | ప్రచార హోరు

మళ్లీ గెలిపించాల్సింది మీరే

- కూకట్‌పల్లి బీఆర్ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు
- పదేళ్ల అభివృద్ధి కళ్ల ముందే కనిపిస్తోందని వ్యాఖ్య
- ఇతర పార్టీల మాయ మాటలు నమ్మి మోసపోవద్దు
- కారు గుర్తుకే ఓటేయండి.. అభివృద్ధిని కొనసాగించండి



కేపీహెచ్‌బీ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న మాధవరం కృష్ణారావు



ప్రచారంలో ఎమ్మెల్యేకు మద్దతు తెలుపుతూ కేరింతలు కొడుతున్న మహిళలు



కూకట్‌పల్లి: ఎన్నికలు దగ్గర పడుతుండటంతో కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు ప్రచారంలో జోరు పెంచారు. సోమవారం కేపీహెచ్‌బీ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో ప్రజా ఆశీర్వాద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ... ఎన్నికలకు సమయం ఆసన్నమైందని ప్రతి ఒక్కరూ ఆలోచించి సరైన వ్యక్తికి ఓటు వేయాలన్నారు. నిత్యం అందుబాటులో ఉండే వ్యక్తిగా పదేళ్ల నుంచి వేల కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామన్నారు. పదేళ్లుగా జరిగిన అభివృద్ధికి సాక్ష్యం ప్రజలేనని.. మళ్లీ తనను గెలిపించాల్సింది ప్రజలేనని అన్నారు. మరోసారి ఆశీర్వదిస్తే కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.

ఏ గల్లీ ఎక్కడ ఉందో తెలియని వారు కూడా మాట్లాడుతుంటే నవ్వొస్తుంది..

ఎక్కడెక్కడి నుంచో వచ్చి కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఈ గల్లీ ఎక్కడ ఉందో తెలియని వారు కూడా వచ్చి మాట్లాడుతుంటే నవ్వొస్తోందన్నారు. నియోజకవర్గం పరిధి ఎంత ఉందో తెలియని వ్యక్తులు సైతం అది చేస్తాం.. ఇది చేస్తాం అంటూ మాయ మాటలు చెబుతున్నారని అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలు ఇది గమనించాలని సూచించారు. కళ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధికి.. నిత్యం అందుబాటులో ఉండే వ్యక్తికే ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఇక్కడ ఉండే ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాం..

కూకట్‌పల్లి నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడ తమ వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తూ.. అలాగే ఎంతో మంది ఉద్యోగాలు చేసుకునేవారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఇక్కడి ప్రజలు సమస్యలు లేకుండా సుఖ సంతోషాలతో జీవిస్తున్నారని పేర్కొన్నారు. దీనికి ప్రధాన కారణం బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధేనని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని బలపరిచే విధంగా అందరూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

అందరికీ నివాసయోగ్యమైన ప్రాంతం కూకట్‌పల్లి నియోజకవర్గం

కళ్ల ముందు అభివృద్ధి కనిపిస్తుంటే ఇతర పార్టీల అభ్యర్థులు అభివృద్ధే జరగలేదన్నట్టుగా మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. మసి పూసి మారెడు కాయ చేసే మాటల్ని నమ్మొద్దని ప్రజలకు సూచించారు. అంతర్జాతీయ కంపెనీలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టి ఉద్యోగాలు కల్పిస్తున్నాయని.. ఇదంతా మంత్రి కేటీఆర్ చొరవేనని కృష్ణారావు పేర్కొన్నారు. దీనిని ఇక్కడి యువత గమనించాలని సూచించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో పాటు చిరు వ్యాపారులకు నివాసయోగ్యమైన ప్రాంతం కూకట్‌పల్లి నియోజకవర్గమని పేర్కొన్నారు.

పదేళ్లకు ముందు కూకట్‌పల్లికి.. ఇప్పటి కూకట్‌పల్లికి మార్పు గమనించాలి..

కూకట్‌పల్లి నియోజకవర్గంలో కేవలం పదేళ్ల కాలంలో ఎన్నో ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్ బ్రిడ్జిలు నిర్మించామని తెలిపారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అనేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. పదేళ్లకు ముందు కూకట్‌పల్లికి.. ఇప్పటి కూకట్‌పల్లికి మార్పు గమనించాలని ప్రజలకు సూచించారు. శాంతి భద్రతలు ఇలాగే ఉండాలంటే తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలన్నారు. ప్రతి ఒక్కరూ నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.







బాలాజీనగర్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు సతీమణి లక్ష్మీబాయి



జనసేన పార్టీకి షాక్..



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన జనసేన కోఆర్డినేటర్ తుమ్మల మోహన్ కుమార్ తదితరులు

కూకట్‌పల్లి: ఎన్నికల వేళ కూకట్‌పల్లి నియోజకవర్గంలో జనసేన పార్టీకి భారీ షాక్ తగిలింది. కూకట్‌పల్లి నియోజకవర్గం జనసేన పార్టీ కో-ఆర్డినేటర్ తుమ్మల మోహన్‌కుమార్ గులాబీ గూటికి చేరారు. సోమవారం సతీష్ అరోరా ఆధ్వర్యంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మోహన్‌కుమార్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

తెలంగాణలో టీడీపీ నాశనానికి రేవంత్‌రెడ్డియే కారణం

టీపీసీసీ చీఫ్ విమర్శలపై ఘాటుగా స్పందించిన గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి రోడ్డు షోలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి విమర్శలపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సోమవారం ఘాటుగా స్పందించారు. పార్టీ మారి, తెలుగుదేశం పార్టీకి ద్రోహం చేసారన్న రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. నాలుగు పార్టీలు మారిన ఆయన తనను విమర్శించటం హాస్యాస్పదంగా ఉందన్నారు. నేను ఏ పరిస్థితుల్లో పార్టీ మారానో చంద్రబాబు నాయుడుకి, ప్రజలకు తెలుసన్నారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ సర్వనాశనం కావడానికి కారణం రేవంత్‌రెడ్డి కాదా అని ఆయన ప్రశ్నించారు. ఆయన తన మీద చేసింది కేవలం ఆరోపణలు మాత్రమేనని కానీ రేవంత్‌రెడ్డి బాగోతం దేశమంతా టీవీల్లో చూసిందన్నారు. తనను విమర్శించే నైతిక అర్హత కూడా రేవంత్‌రెడ్డికి లేదన్నారు. తనపై చేసిన ఆరోపణ నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానన్నారు. నిరూపించకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటావా అని రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు.

జగదీశ్వర్‌గౌడ్‌కు మద్దతుగా తుమ్మల నాగేశ్వరరావు ప్రచారం



కూకట్‌పల్లి: శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్‌కు మద్దతుగా సోమవారం మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రచారం చేశారు. శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జగదీశ్వర్‌గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు.

తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి ఎదురులేదు

మాధవరం కాంతారావు



బీజేపీ, జనసేన అధ్యక్షులతో మాధవరం కాంతారావు, ప్రేమకుమార్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీజేపీ, జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ గెలుపు కోసం ఆదివారం సాయంత్రం కూకట్‌పల్లిలోని మెట్రో ట్రక్ పార్కు మైదానంలో విజయ సంకల్ప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్,ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగలు హాజరయ్యారు.

- ఈ సందర్భంగా కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో పక్కా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. ఇప్పటికే విడుదల చేసిన మేనిఫెస్టోకు అనూహ్య స్పందన లభించిందన్నారు. బీసీ అభ్యర్థినే తెలంగాణ ముఖ్యమంత్రి అనే హామీ మెజార్టీ బీసీలకు మంచి జోష్ అందించిందని అన్నారు. విజయ సంకల్ప సభతో తమ సత్తా ఏమిటో బీఆర్ఎస్ పార్టీకి చూపించామన్నారు.
- ఈసారి బీజేపీతో కలిసి వస్తున్న మిత్రపక్షమైన జనసేన పార్టీ అభ్యర్థులను తెలంగాణ ప్రజలు ఆదరిస్తున్నారని తెలిపారు. జనసేన పార్టీ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ప్రజా రంజక పాలనను, అవినీతి రహిత పాలన అందిస్తున్న నరేంద్ర మోదీ కలను సాకారం చేయాలన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌ను ఏర్పాటు చేయాలని కాంతారావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సూర్యరావు, రాజేశ్వరరావు, హరీష్‌రెడ్డి, శ్రీకర్‌రావు, బీజేవైఎం నేతలు, డివిజన్ నాయకులు, జన సైనికులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌ను గెలిపించండి

బీజేపీ కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు



బాలానగర్‌లో ప్రచారం చేస్తున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి: బాలానగర్ డివిజన్‌లో సోమవారం బీజేపీ పార్టీ బలపర్చిన జనసేన పార్టీ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌కు మద్దతుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూకట్‌పల్లి నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే అధికార మార్పిడి జరగాలన్నారు. విద్యావంతుడైన ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అభివృద్ధికి ఒక్క అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో గాజు గ్లాసు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

హ్యాట్రిక్ విజయం సాధిస్తాం

ఆల్విన్‌కాలనీ: ఎరుకల సమాజం సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కరిస్తానని అరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి బీఆర్‌యస్ అభ్యర్థి గాంధీకి తెలంగాణ ఎరుకల సంఘం గ్రేటర్ హైదరాబాద్ కమిటి, శేరిలింగంపల్లి నియోజవర్గ ఎరుకల సంఘం నాయకులు తమ పూర్తి మద్దతు తెలిపారు. సోమవారం బీఆర్‌యస్ అభ్యర్థి గాంధీని కలిసి ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎరుకల సంఘం గ్రేటర్ హైదరాబాద్ కమిటి అధ్యక్షుడు రస్తాపురం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బిజిలి ఎల్లేష్, కమిటి సభ్యులు ఎరుకల ఆత్మ గౌరవ సభను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా అరెకపూడి గాంధీ, గౌరవ సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే కుర్ర సత్యనారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు కూతాడి రాములు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజు హాజరయ్యారు.

భారీ మెజార్టీతో గెలవడం ఖాయం

ఆల్విన్‌కాలనీ: బీఆర్‌యస్, కాంగ్రెస్ పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని మాజీ శాసనసభ్యుడు ఎం. భిక్షపతి యాదవ్ పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1లో బీజేపీ సీనియర్ నాయకులు రాయల్, వెంకటస్వామిరెడ్డి, యాదవరెడ్డిల నివాసాలకు వెళ్లి వారి మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి రవికుమార్ యాదవ్‌ని భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీజేపీ ద్వారా మాత్రమే సాధ్యమవుతుందన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి రవికుమార్‌ను మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజల అండదండలతోనే

కాంగ్రెస్ విజయం ఖాయం

కూకట్‌పల్లి పార్టీ అభ్యర్థి బండి రమేష్



కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్‌ను కలిసి మద్దతు తెలిపిన తెలంగాణ సపోర్టర్స్ జేఏసీ సభ్యులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని, వారి అండదండలతో కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లిలో జెండా ఎగరవేయటం ఖాయమని కూకట్‌పల్లి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి బండి రమేష్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం బాలానగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కూకట్‌పల్లి కాపు సంఘం నాయకుడు అందే శ్రీరామ్ మూర్తి కాపు సంఘం తరపున పూర్తి మద్దతు తెలిపారు.

- ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... గడిచిన పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు పరచడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తాను స్థానికుడిని కాదని ప్రతిపక్ష పార్టీలో ఆరోపించటం విచారకరమన్నారు. తాను కూకట్‌పల్లి నియోజకవర్గానికి సుపరిచితుడినని నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ నిస్వార్థంగా సేవ చేస్తానని హామీ ఇచ్చారు.
- కూకట్‌పల్లికి చెందిన పాత, కొత్త తరం నాయకులు కాంగ్రెస్ విజయానికి కృషి చేస్తున్నారని వారందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ 80 నుంచి 90 సీట్లు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రచారం కమిటీ కో ఆర్డినేటర్ శ్యాం సుందర్, సీనియర్ నాయకులు గాలి బాలాజీ, అందే శ్రీరామ్ మూర్తి ఎం. లక్ష్మయ్య, కట్ట శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న బండి రమేష్

మద్దతు తెలిపిన అమరావతి సపోర్టర్స్...

- కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్‌కు అమరావతి సపోర్టర్స్ జేఏసీ సభ్యులు కొల్లి ప్రవీణ్, కుసు భార్గవ్, సాయి చింతమనేని, శ్రీనివాస్, రేఖ, హిమబిందు, ఆర్‌కే చౌదరి, ఫణీంద్ర తదితరులు విచ్చేసి బండి రమేష్‌కు మద్దతు తెలిపారు.

కార్తీక పౌర్ణమి శోభ

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీలోని హరిహర క్షేత్రంలో కార్తీకపౌర్ణమి పూజలు సోమవారం వైభవంగా జరిగాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే శివాలయంలో పురోహితులు పంతులు కృష్ణ సూరి సమక్షంలో శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. సాముహిక అభిషేకాలు జరిగాయి. సాయంత్రం కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మోతీనగర్: అల్లాపూర్, మూసాపేట డివిజన్లలోని పలు దేవాలయాల్లో ఉదయం తెల్లవారుజాము నుంచి శివయ్య దర్శనం కోసం భక్తులు తరలి వచ్చారు. అదే విధంగా రాత్రి దీపాలను వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు. కార్తీక సోమవారం సందర్భంగా వి.రామారావునగర్ శివాలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.



దేవాలయంలో భక్తులు వెలిగించిన కార్తీక దీపాలు



దేవాలయంలో ప్రత్యేక అలంకరణలో శివలింగం





మోతీనగర్ శంకర్‌మఠ్ లో జ్యోతిర్లింగార్చన